క్లుప్తంగా

ఎమ్మెల్యే వినోద్‌ను కలిసిన మందమర్రి జీఎం



వినోద్‌కు మొక్క అందిస్తున్న జీఎం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను మంగళవారం మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ (జీఎం) మేనేజర్ ఎస్. రాధాకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. రాధాకృష్ణ ఇటీవల మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలో ఉన్న క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వినోద్‌కు పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జీఎం దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్ఎస్ఎస్ శత జయంతి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

భీమిని: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శత జయంతి వేడుకలను మంగళవారం భీమిని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బౌతిక ప్రముఖ్ ఉప్పాల రూపచారి, బీజేపీ మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం



గ్రామస్తులు చంపిన కొండచిలువ

వేమనపల్లి: మండలకేంద్రంలోని ప్రాణహిత కాలనీ మంగళవారం రాత్రి భారీ కొండచిలువ హల్‌చల్ సృష్టించింది. గంగు రమేశ్‌కు చెందిన పాడుబడిన ఇంట్లో నుంచి వెళ్లిన కొండచిలువ రోడ్డు దాటి పరమేశ్వర్ ఇంటివైపు వెళ్తుండగా, అక్కడే బతుకమ్మ ఆడుతున్న మహిళలు గమనించారు. భయాందోళనకు గురై స్థానికులు కొండ చిలువను చంపివేశారు.

నేడు విజయదశమి ఉత్సవ సమావేశం

చెన్నూర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘాన్ని స్థాపించి విజయదశమికి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చెన్నూర్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 4గంటలకు స్థానిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో విజయదశమి ఉత్సవ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు శాఖ కార్యవహ మంచాల రాజబాపు తెలిపారు. ఉత్సవ సమావేశానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఉపాధ్యాయులు గన్ను పురుషోత్తం, వక్తగా డాక్టర్ యశ్వంతుల వెంకటేశ్ హాజరవుతారని పేర్కొన్నారు. పట్టణంలోని హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

2న మాంసం దుకాణాలు బంద్ పాటించాలి

మందమర్రిరూరల్: అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని మాంసం విక్రయషాపుల యజమానులు బంద్ పాటించాలని మున్సినల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి మాంసం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

చెన్నూర్‌రూరల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలోని కిష్టంపేట వై జంక్షన్ వద్ద చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్‌రావు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎలక్షన్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. రూ.50వేలకు మించి ఎవరూ వెంట తీసుకెళ్లద్దన్నారు.

1న బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు

పాతమంచిర్యాల: డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్స్ నుంచి భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్)పబ్లిక్ సెక్టార్ కంపెనీగా ఏర్పాటై 2025అక్టోబర్ 1నాటికి 25సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అక్టోబర్ 1న ఉద్యోగులు బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు, టెలికాం డీఈ ప్రకాష్ తెలిపారు.

ఆకట్టుకుంటున్న దాండియా..!







మంచిర్యాలఅర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక హిందీ హైస్కూల్ గ్రౌండ్ దాండియా నృత్యాలతో సందడిగా మారుతోంది. గుజారాత్, రాజస్థాన్‌కు చెందిన మార్వాడీ మహిళలు చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా దాండియా.. ఓ దాండియా అని పాడుతూ చేస్తున్న నృత్యాలు అలరిస్తున్నాయి. మట్టితో వేదిక చేసి నీటితో ఉన్న మట్టికుండలో గోధుమ విత్తనాలు చల్లి.. అందులో ఏదో ఒక నాణేం (వెండి, ఇతరత్రా కాయిన్స్) వేస్తారు. ఆ కుండను అమ్మవారిగా పూజిస్తారు. హోమం చేసి దశమిరోజు నిమజ్జనం చేయటం ఆనవాయితీ. ప్రతీ రోజు అమ్మవారి చిత్రపటం వద్ద మహిళలు, పురుషులు చేరి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం కాగానే నిర్వహించే దాండియా నృతం కోసం మహిళలు, చోళీ, గాగ్రా దుస్తులను ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. వాయిద్యాలు, పాటలతో ఎదురెదురుగా, చుట్టూ తిరుగుతూ స్టెప్పుల వారీగా ఆడటం చూపరులను కట్టిపడేస్తోంది.

‘కోడ్’ కూసింది...ఫ్లెక్సీ తొలగింది!



దండేపల్లి: ఫ్లెక్సీ తొలగిస్తున్న జీపీ సిబ్బంది

భీమారం/జన్నారం/తాండూర్/దండేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచే ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చింది. దీంతో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రచార రాతలు, ఫ్లెక్సీలను తొలగించే చర్యలు చేపట్టింది. మంగళవారం తాండూర్, జన్నారం, భీమారం, దండేపల్లి మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించి గోడ రాతలను చెరిపి వేశారు.



కామన్‌పల్లిలో ఇళ్ల పక్కనే నిలిచిన మురికినీరు

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం!

- నీరు నిలిచి అధ్వానంగా రోడ్లు
- వెలగని వీధి దీపాలు
- పట్టించుకోని అధికారులు

జన్నారం: పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండలంలోని కామన్‌పల్లి, కవ్వాల్, చర్లపల్లి, ధర్మారం, తిమ్మాపూర్‌లో గ్రామాల్లో పలుచోట్ల రోడ్డు పక్కనే, ఇళ్ల మధ్య మురికి నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా దోమలు చేరి ప్రజలు జ్వరాల భారిన పడుతున్నారు. జన్నారం మండలంలో 29గ్రామ పంచాయతీలుండగా, వీటిలో రెండు, మూడు గ్రామ పంచాయతీలు తప్పా మిగితా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ లేక ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. పలు గ్రామాల్లో వీధి దీపాలు లేక ప్రజలు చీకట్లో మగ్గుతున్నారు. ఇటీవల మండలంలోని పలువురు మాజీ సర్పంచులు వీధి దీపాలు అమర్చాలని ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణతో పాటు, వీధి దీపాలు అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్వహణ కొరవడింది



గ్రామాల్లో సర్పంచుల పాలన ముగిసిన తర్వాత కొన్ని రోజులు కార్యదర్శులతో పాలన భాగానే నడిపించారు. కానీ నిధుల కొరతతో కార్యదర్శులు పూర్తి స్థాయిలో పనులు చేయలేకపోతున్నారు. పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కనీసం వీధి దీపాలు అమర్చలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు సమస్యలపై దృష్టి పెట్టాలి.

– జాడి గంగాధర్, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు

పారిశుద్ధ్యంపై దృష్టి సారిస్తున్నాం

ఇటీవల కొన్ని రోజులుగా వర్షం కురుస్తోంది. దీని కారణంగా గ్రామాల్లో గుంతలు ఏర్పడుతున్నాయి. పారిశుద్ధ్యం నిర్వహణపై కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. వీధి దీపాలు అమర్చాలని తెలియజేశాం. అపరిశుభ్రత లేకుండా కార్యదర్శులు చూసుకోవాలి.

– జలందర్, ఎంపీవో, జన్నారం

‘స్థానిక’ ఎన్నికలకు రిజర్వేషన్లు ఇలా..

తాండూర్/జైపూర్/భీమారం: ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లను అధికారులు ప్రకటించారు. ఎంపీటీసీకి 9న నామినేషన్ దాఖలు చేయాల్సి ఉండగా అక్టోబర్ 23న ఎన్నికలు నిర్వహించనున్నారు. జీపీలకు అక్టోబర్ 17న నామినేషన్లకు చివరి తేదీ కాగా అక్టోబర్ 31న ఎన్నికలు నిర్వహించనున్నారు.

భీమారం మండలంలో...

ఎంపీపీ	ఎస్టీ జనరల్
జెడ్పీటీసీ	ఎస్సీ జనరల్
గ్రామాలు	**రిజర్వేషన్లు (ఎంపీటీసీ)**
భీమారం-1	బీసీ (మహిళ)
భీమారం-11	జనరల్
భీమారం-111	ఎస్టీ (జనరల్)
కాజిపల్లి	ఎస్సీ(జనరల్)
మద్దికల్	జనరల్

సర్పంచ్ స్థానాలకు

గ్రామాలు	రిజర్వేషన్లు (సర్పంచ్)
భీమారం	బీసీ మహిళ
నర్సింగాపూర్	ఎస్టీ మహిళ
బూర్గుపల్లి	ఎస్టీ జనరల్
ఆరెపల్లి	ఎస్సీ జనరల్
ధర్మారం	ఎస్సీ జనరల్
కాజిపల్లి	ఎస్సీ మహిళ
దాంపూర్	బీసీ జనరల్
ఎలకేశ్వరం	బీసీ మహిళ
మద్దికల్	బీసీ జనరల్
కొత్తపల్లి	జనరల్
పోలంపల్లి	జనరల్ మహిళ

తాండూర్ మండలంలో

గ్రామాలు	రిజర్వేషన్లు
అచ్చలాపూర్	జనరల్
కాసిపేట	జనరల్(మహిళ)
బోయపల్లి	ఎస్టీ జనరల్
కొత్తపల్లి	ఎస్సీ జనరల్
తాండూర్-1	బీసీ జనరల్
కిష్టంపేట	బీసీ జనరల్
తాండూర్-2	ఎస్సీ(మహిళ)
మాదారం	బీసీ(మహిళ)
రేచిని	బీసీ(మహిళ)

సర్పంచ్ స్థానాలకు...

గ్రామాలు	రిజర్వేషన్లు
అచ్చలాపూర్	బీసీ(మహిళ)
రాజీవ్‌నగర్	బీసీ(మహిళ)
బోయపల్లి	ఎస్సీ జనరల్
తాండూర్	ఎస్సీ జనరల్
చౌటపల్లి	జనరల్(మహిళ)
కాసిపేట	జనరల్(మహిళ)
ద్వారకాపూర్	బీసీ జనరల్
కొత్తపల్లి	బీసీ జనరల్
మాదారం-3 ఇంక్‌లైన్	బీసీ జనరల్
గోపాల్‌నగర్	ఎస్టీ జనరల్
కిష్టంపేట	ఎస్టీ జనరల్
మాదారం	ఎస్సీ(మహిళ)
నర్సాపూర్	జనరల్
సీలాయపల్లి	జనరల్
రేచిని	ఎస్టీ (మహిళ)

జైపూర్ మండలంలో...

గ్రామం	రిజర్వేషన్ (సర్పంచ్)
జైపూర్	ఎస్టీ (జనరల్)
ఇందారం	బీసీ(జనరల్)
పెగడపల్లి	ఎస్సీ(జనరల్)
కుందారం	ఎస్సీ(మహిళ)
షెట్‌పల్లి	ఎస్సీ(మహిళ)
రామారావుపేట	ఎస్సీ(జనరల్)
టేకుమట్ల	బీసీ(జనరల్)
మిట్టపల్లి	బీసీ(జనరల్)
వేలాల	బీసీ(మహిళ)
నర్సింగాపూర్	ఎస్సీ(జనరల్)
గంగిపల్లి	ఎస్సీ(మహిళ)
కిష్టాపూర్	ఎస్సీ(జనరల్)
బెజ్జాల	ఎస్సీ(మహిళ)
శివ్వారం	బీసీ(మహిళ)
ముదిగుంట	బీసీ(మహిళ)
పౌనూర్	బీసీ(మహిళ)
ఎల్కంటి	బీసీ(జనరల్)
కాన్కూర్	జనరల్(మహిళ)
నర్వ	జనరల్
వెంకట్రావుపల్లి	జనరల్

ఎంపీటీసీ స్థానాలకు...

గ్రామం	రిజర్వేషన్
జైపూర్	జనరల్(మహిళ)
ఇందారం, ఇందారం-2	జనరల్
ఇందారం-1	ఎస్సీ(మహిళ)
పెగడపల్లి	ఎస్సీ జనరల్
కుందారం	ఎస్సీ (మహిళ)
షెట్‌పల్లి	ఎస్సీ(జనరల్)
రామారావుపేట	బీసీ(మహిళ)
టేకుమట్ల	బీసీ(మహిళ)
మిట్టపల్లి	బీసీ(జనరల్)
వేలాల	బీసీ(జనరల్)

పట్టుపట్టారు.. కొలువు కొట్టారు



తిరుపతి గోపిచంద్ శ్రీనివాస్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ప్రాణిహిత కాలనీ (షిర్కే)కి చెందిన బొడ్డు భూమయ్య పోసక్కల కుమారుడు తిరుపతి గ్రూపు-2 ఫలితాల్లో 77ర్యాంకుతో ఉత్తీర్ణుడై ఏఎస్‌వో(జీఏడీ)గా ఉద్యోగం సాధించాడు. 2016లో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన జేఎంఈటీ పరీక్షలో ఉత్తీర్ణుడై మైనింగ్ సర్దార్‌గా ఉద్యోగం పొందాడు. గ్రూపు-4 ఫలితాల్లో పాసై క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇప్పుడు గ్రూపు-2లో ఉద్యోగం రావడంతో కుటుంబసభ్యులతో పాటు, పలువురు తిరుపతిని అభినందించారు.

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన గాజుల శ్రీనివాస్ గ్రూప్-2లో ప్రతిభ కనబర్చి పంచాయతీ రాజ్ శాఖలో ఎంపీవోగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఇదే శాఖలో ఆసిఫాబాద్‌లో పంచాయతీ సెక్రెటరీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్, అదే శాఖలో ఉన్నత ఉద్యోగం సాధించటంపై పలువురు ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు శ్రీనివాస్‌ను అభినందించారు.

కొలువు చేస్తూ.. మరో కొలువు

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన అజ్మీరా గోపిచంద్‌నాయక్ గ్రూప్-2లో ఎస్‌డబ్ల్యూవో ఉద్యోగం సాధించాడు. 2019లో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించిన అతడు, ప్రస్తుతం జన్నారం మండలం కిష్టాపూర్ జీపీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఓ వైపు ప్రభుత్వ కొలువు చేస్తూనే మరో వైపు, గ్రూప్-1, 2కు ప్రిపేర్ అయ్యాడు. ప్రణాళికతో చదివి గ్రూప్-2లో మరో ప్రభుత్వ కొలువు సాధించిన అతడిని పలువురు అభినందించారు.

‘స్థానిక’ఎన్నికల్లో సత్తా చాటాలి



శంకర్‌ను సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

చెన్నూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. చెన్నూర్ సీపీఐ కార్యాలయంలో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జెడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను మండల కార్యదర్శి సేకరించాలన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో సీపీఐ బలంగా ఉందన్నారు. అన్ని మండలాల్లో పార్టీ పోటీ చేస్తుందన్నారు. అనంతరం సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన శంకర్‌ను చెన్నూర్ మండల సీపీఐ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మండల కార్యదర్శి నెన్నల సమ్మయ్య, చందు, మదునయ్య, నారాయణ, రజింత్, వెంకటిలు పాల్గొన్నారు.

కొనసాగిన బతుకమ్మ నిమజ్జనం



లక్సెట్టిపేట: ఏదో వార్డులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

లక్సెట్టిపేట/వేమనపల్లి/తాండూర్/మంచిర్యాలఅర్బన్: సద్దుల బతుకమ్మ వేడుకలు మంగళవారం లక్సెట్టిపేటలో ఘనంగా నిర్వహించారు. మహిళలు ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ పాటలు పాడి ఆటలాడారు. అనంతరం బతుకమ్మలను సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. పలు చోట్ల సోమవారం సాయంత్రం మొదలుపెట్టిన బతుకమ్మ వేడుక మంగళవారం మధ్యాహ్నం వరకు కూడా నిరాటంకంగా కొనసాగింది. జిల్లా కేంద్రంలోని తిరుమలగిరి కాలనీలో షణ్ముఖ అగ్రిటెక్ కంపెనీ సంస్థ సీనియర్ రీజినల్ మేనేజర్ గుండ్ల స్వామి ఆధ్వర్యంలో ఆట, పాట, ప్రదర్శన విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



బహుమతులు ప్రదానం

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం

శ్రీరాంపూర్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. స్వచ్ఛతాహి సేవ 2025కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం ఆర్కే 8 డిస్పెన్సరీలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి బాజీ సైదా, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేశ్ బాబు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్, వైద్యులు మురళీధర్, లోక్ నాథ్ రెడ్డి, సాయి, నికిత, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి రమణ, నాయకులు కొమురయ్య, భద్రి బుచ్చయ్య పాల్గొన్నారు.

జీఎం అభినందన

శ్రీరాంపూర్: గ్రూప్ 1 పరీక్ష ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించి బీసీ వెల్ఫేర్ అధికారిగా ఎంపికైన చుంచు సాయిశ్రీజను మంగళవారం శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ అభినందించారు.

మూతపడిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్



మందమర్రిరూరల్: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సుమారు రూ.10 లక్షలతో నిర్మించిన క్యాంటీన్‌ను ఫిబ్రవరి 5న కలెక్టర్ కుమార్‌దీపక్ ప్రారంభించారు. ఈ క్యాంటీన్ 25 రోజులుగా మూతపడింది. ముగ్గురు మండల సమాఖ్య మహిళా సంఘం సభ్యులు ఈ క్యాంటీన్‌ను నడిపిస్తున్నారు. నిర్వాహకులు సంఘానికి అద్దె పేరిట నెలకు రూ.5వేలు చెల్లించేవారు. ఎంపీడీవో ఆఫీస్ నుంచి సింగరేణి సరఫరా చేసే విద్యుత్‌ను ఉచితంగా వాడుకున్నారు. రెండునెలల క్రితం వరకు విద్యుత్ కనెక్షన్ కట్ చేయగా, ఐకేపీ కార్యాలయం నుంచి తీసుకున్నారు. అద్దె, విద్యుత్ బిల్లుల పేరిట నెలకు రూ.10 వేల వరకు చెల్లించాల్సిన పరిస్థితి. దానికి తోడు గత నెలలో వినాయకచవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు ఉండడం వల్ల క్యాంటీన్‌లో గిరాకీ లేదు. 25రోజులుగా తెరవక నిరుపయోగంగా ఉండడంతో ఆటోలకు అడ్డాగా మారింది. ఈ విషయమై ఐకేపీ ఏపీవో చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. రెండు, మూడురోజుల్లో తెరుస్తామని నిర్వాహకులు తెలిపినట్లు పేర్కొన్నారు.



ప్రమాదం జరగక ముందే.. పట్టించుకోండి

చెన్నూర్‌రూరల్: మండలంలోని నారాయణపూర్‌కి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు మొలిచి రోడ్డుపైకి వచ్చాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడడం లేదు. ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించాలని కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టరూ?

భీమారం: మండలంలోని ఆరెపల్లి-మద్దికల్ మధ్య ప్రధాన రోడ్డులో గుంతలు పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని గుంతలు పూడ్చి రాకపోకలు సాఫీగా సాగేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

